క్లుప్తంగా

దివ్యాంగురాలికి ఆర్థిక సాయం



యడ్లపాడు: పేద దివ్యాంగురాలిని ఎంఆర్ ఫౌండేషన్ ఆర్థికంగా ఆదుకుంది. ఉన్నవ గ్రామానికి చెందిన పరమాత్ముల కోటేశ్వరమ్మ కొద్దికాలం కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమె కాలు తొలగించారు. ఒంటికాలిపై కర్రలసాయంతో జీవితాన్ని గడుపుతున్న ఆమె దీనపరిస్థితిని గ్రామస్తులు ఎంఆర్ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఫౌండేషన్ చైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు తన ప్రతినిధుల చేతుల మీదుగా సోమవారం రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుత్తి సింగయ్య, గల్లా వీరరాఘవయ్య, వెంకట్రావు, కుంచెనపల్లి సాంబశివరావు, వెంకట్రావు, గ్రామపెద్దలు, ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వరిగడ్డివాములు దగ్ధం



వినుకొండ(నూజెండ్ల) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు వరి గడ్డివాములు దగ్ధమైన ఘటన వినుకొండ మండలంలోని పెదకంచర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామం నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్ల షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి కొలగాని వెంకటేశ్వర్లుకు చెందిన 15 ఎకరాల వరిగడ్డి, కొంగన ఆంజనేయులుకు చెందిన 4 ఎకరాల వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. సుమారు రూ.మూడు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది ఎస్వీ రమణారెడ్డి, ఎం.కోటేశ్వరరావు, ఎం.మల్లికార్జునరావు, జి.రామకృష్ణారావు పాల్గొన్నారు.

పిండమార్పిడి విధానంతో పశు సంతతి వృద్ధి



శావల్యాపురం: పిండమార్పిడి విధానంతో పశు సంతతి వృద్ధి చెందుతుందని రొంపిచర్ల పశువైద్యాధికారి అవుల సాయిమహేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో శావల్యాపురం గ్రామానికి చెందిన ముద్దా అచ్చయ్యకు చెందిన ఆవుకు పిండిమార్పిడి విధానంలో చూడి చేయించే విధానానికి శ్రీకారం చుట్టారు. ఈపూరు మండలంలో పిండిమార్పిడి విధానం రెండు ఆవులకు చేశామని పూర్తి స్థాయిలో విజయవంతమైనట్టు చెప్పారు. పశు వైద్యాధికారి రావెళ్ళ సురేష్, సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

టైఫాయిడ్ నిరోధక టీకాలు పంపిణీ



రొంపిచర్ల: స్థానిక భగత్ సింగ్ భవనంలో సోమవారం సబ్సిడీ ధర పై టైఫాయిడ్ నిరోధక టీకాలు పంపిణీ కార్యక్రమం పోరంకి మోహన్ కుమార్, సరోజా దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించారు. 40 మందికి పైగా టైఫాయిడ్ నిరోధక టీకాలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు సంద్రపాటి చలపతిరావు మాట్లాడుతూ టైఫాయిడ్ నిరోధక టీకాలు వేయించుకున్న వారికి మూడు సంవత్సరాల పాటు ఈ వ్యాధి రాదని వివరించారు. ప్రతి మూడేళ్లకోసారి టీకాలు వేయించుకోవటం మంచిదన్నారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు సరికొండ రామకృష్ణంరాజు, బాజీ రాణి, మస్తాన్ వలి, శేషంరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాసం విత్తనాలు మంజూరు

శావల్యాపురం: పాడి పోషకులకు రాయితీపై పశుగ్రాసం జొన్న రకం విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి రావెళ్ళ సురేష్ సోమవారం తెలిపారు. ఒక్కో రైతుకు 15 కేజీల వరకు ఇస్తామని, ఐదు కేజీల సంచి రాయితీ మినహాయించి రూ.115కు ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 3 టన్నులు వచ్చాయని పేర్కొన్నారు.

తారెత్తిస్తున్న భానుడు

- 45 నుంచి 48 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- మరో నాలుగు రోజుల పాటు భగభగలే
- గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణ తీవ్రత



నిర్మానుష్యంగా పట్టణంలోని గడియార స్తంభం సెంటర్

సత్తెనపల్లి: ఎండలు తారెత్తిస్తున్నాయి. భానుడి భగభగలతో జనం హడలిపోతున్నారు. వచ్చే నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ చేసిన హెచ్చరిక ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఆదివారం సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సత్తెనపల్లిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. సత్తెనపల్లిలో 45 డిగ్రీల ఉష్ణో గ్రత నమోదు కాగా ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామంలో 48 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డ్ అయ్యింది. గత నాలుగు రోజులుగా క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే వేడి అధికంగా ఉంటోంది. ఉష్ణోగ్రతలు పెరగడానికి తోడు ఉక్కపోత కూడా తోడవడంతో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. ఉష్ణతాపం నుంచి ఉపశమనం కోసం ప్రజలు శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, జ్యూస్‌లు, ఇతర పానీయాలను ఎక్కువగా సేవిస్తున్నారు. ఎండ తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రత బాగా పెరగడంతో వేడిని తట్టుకోలేక అనేక మంది జలుబు, జ్వరం వంటి వ్యాధుల బారిన పడుతున్నారు.

గతేడాది కన్నా అధికంగా ..

గతేడాది ఏప్రిల్‌లో సత్తెనపల్లిలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మే లో 42 డిగ్రీలకు చేరుకుంది. అందుకు భిన్నంగా ప్రస్తుతం 45 డిగ్రీలకు చేరుకుంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతోంది. అంటే గతేడాది కంటే 15 రోజుల ముందే ఎండలు ప్రతాపం చూపిస్తున్నాయి.

నిర్మానుష్యంగా రోడ్లు ....



నిర్మానుష్యంగా పట్టణంలోని తాలూకా సెంటర్

ఎండల తారెత్తిస్తుండడంతో మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వ్యాపారాలు సైతం మందకొడిగా సాగుతున్నాయి. కొందరు వ్యాపారులైతే మిట్ట మధ్యాహ్నం రెండు, మూడు గంటల పాటు దుకాణాలను మూసివేస్తున్నారు. మళ్లీ ఎండల తీవ్రత తగ్గిన తర్వాత తెరుస్తున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం ....

సత్తెనపల్లి డివిజన్ పరిధిలో గత పది రోజుల్లో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. ఎండల తీవ్రత పెరగడంతో విద్యుత్ వినియోగం సైతం అదే స్థాయిలో పెరుగుతోంది. ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్లు వంటి వాడకం పెరగడమే దీనికి ప్రధాన కారణం. రానున్న రోజుల్లో విద్యుత్తు వినియోగం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని ట్రాన్స్ కో అధికారులు చెబుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు ..

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ...

చెమట పట్టక పోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం, తగినంత నిద్ర పట్టక పోవడం, కలవరింతలు రావడం, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితికి వెళ్లడం వంటి లక్షణాలను వడదెబ్బగా గుర్తించాలి. మాంసాహారం తగ్గించాలి.తాజా కురగాయాలను ఆహారంగా తీసుకోవడం మంచిది. నీరు, పళ్లరసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. తక్కువ మోతాదులో ఆహారాన్ని ఎక్కువ సార్లు తీసుకోవాలి.

రైతుల మేలు కోసం అనేక పథకాలు

- ఎంపీపీ పి.కోటయ్య
- సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ పి.కోటయ్య, పీఏసీసీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, ఏఓ

క్రోసూరు: క్రోసూరు–2, పీసపాడు రైతుభరోసా కేంద్రాల వద్ద సోమవారం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలు ఏర్పాటు చేసిన రైతుసదస్సుల సందర్భంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ పెరుమాళ్లపల్లి కోటయ్య మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతులకు ఉపయోగపడేలా అనేక పథకాలు తీసుకొచ్చిందన్నారు. రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వం రైతు భరోసా కింద అర్హులైన రైతులందరికీ రూ.13,500 అందిస్తున్నట్లు తెలిపారు. క్రోసూరు పీఏసీఎస్ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతుల కోసం రైతుభరోసా కేంద్రాలు వారివారి గ్రామాల్లో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వాటిద్వారా నాణ్యమైన విత్తనాలు, ఈకైవైసీ, పంట నమోదు, బీమా నమోదు, పంట కొనుగోళ్లు, కార్యక్రమాలన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. రైతులు రైతుభరోసా కేంద్రాలు సద్వినియోగపరుచుకోవాలన్నారు. అనంతరం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందచేశారు. పిల్లిపెసర కిలో రూ.97 సబ్సిడీ ధర రూ.48.50 , జనుము రూ.84 సబ్సిడీ ధర రూ.42, జీలుగ రూ.79 సబ్సిడీ ధర రూ.39.50 లకు అన్ని రైతుభరోసా కేంద్రాల్లో అందిస్తున్నట్లు ఏఓ వేణుగోపాల్ తెలిపారు. పీసపాడు గ్రామ సర్పంచ్ గొర్రెపాటి రాజు, పీసపాడు, క్రోసూరు–2 పంచాయతీ కార్యదర్శులు జి.ఆదినారాయణ, షేక్ ఖాజావలి, రైతుభరోసా కేంద్రం సిబ్బంది, పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ సురేష్



వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ సురేష్

నకరికల్లు: వేసవి ఎండలు విపరీతంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉదయం 10గంటలలోపు, సాయంత్రం ఐదుగంటల తర్వాత మాత్రమే బయటకు వచ్చేవిధంగా గ్రామాల్లో దండోరా వేయించాలని వీఆర్వోలకు తహసీల్దార్ ఎస్. సురేష్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా గ్రామములో పౌరహక్కుల దినోత్సవం జరిగేవిధంగా చూసుకోవాలన్నారు. ప్రతిశుక్రవారం గ్రామోదయం కార్యక్రమం జరుగుతున్నందున వీఆర్వోలు ఆయాగ్రామాల్లో సమస్యలను ముందుగా గుర్తించాలన్నారు. గ్రామ వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఫేస్‌యాప్‌లో సమయానికి హాజరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు



మాదల సచివాలయం పరిధిలోని జాబితాలో లబ్ధిదారుడు వివరాలు

ముప్పాళ్ళ: అభూత కల్పనలతో సోషల్‌మీడియా అడ్డుపెట్టుకుని ప్రభుత్వ పనితీరు పై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మారూరిపద్మ సోమవారం తెలిపారు. మండలంలోని మాదల గ్రామానికి చెందిన ఓ.సీ వర్గానికి చెందిన ఆలేటియాదగిరి(ఐడి నెం :10758677) వికలాంగుడు కావడం, అనాథ కావడంతో గత 20 సంవత్సరాలుగా పింఛన్ సాయం పొందుతున్నాడు. అయితే టీడీపీ సానుభూతిపరులు సోషల్‌మీడియా పేరుతో ప్రభుత్వం బురదజల్లే ప్రయత్నంలో భాగంగా టీడీపీకి ఓటు వేసారని పింఛన్ తొలగించారంటూ ప్రసారమాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. తెలుసుకున్న గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు వివరణ ఇస్తూ ఆలేటియాదగిరి ఈ నెల పింఛన్ సొమ్ము రూ.3వేలు కూడా అందించామని చెప్పడంతో టీడీపీ నాయకులు ఖంగుతిన్నారు. కుల, మత,ప్రాంత వర్గ విచక్షణ లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తోందని చెప్పారు. మరో మారు ఇలాంటి అసత్య ప్రచారాలు చేపట్టే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం పై బురద జల్లేందుకు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని అసత్య ప్రచారం చేపడితే అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఏదైనా పోస్టు పెడితే వాస్తవాలను తెలుసుకున్న తర్వాతే చేయాలన్నారు. బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిసే ఎటువంటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి

సత్తెనపల్లి: మండలంలోని గోరంట్ల గ్రామంలో ఆదివారం నేలబావిలో పడి మృతి చెందిన గురజాల ప్రసాద్ మృతి ప్రమాదవశాత్తు జరిగిందని సత్తెనపల్లి రూరల్ ఎస్‌ఐ అవుల బాలకృష్ణ సోమవారం తెలిపారు. ఈ మేరకు మృతుని కుమారుడు గురజాల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.ప్రసాద్ మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి మృత దేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపంతో వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కమ్మవారిపాలెంకు చెందిన బోడపాటి రోశయ్య(55) పొలం పనులు చేస్తుంటాడు. డబ్బుల విషయంలో మధ్యవర్తిగా ఉన్న రోశయ్య ఆ విషయంలో కుటుంబ సభ్యుల మాటలకు మనస్థాపం చెంది మండలంలోని బొప్పూడి ఆంజనేయస్వామి గుడి ఎదురు పొలాల్లో పురుగుమందు తాగి మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి సీఐగా ఏవీ బ్రహ్మం



అమరావతి: అమరావతి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఏవీ బ్రహ్మం సోమవారం ఉదయం అమరావతి సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో గుంటూరు సీసీఎస్‌లో సీఐగా పనిచేసిన ఏవీ బ్రహ్మం అమరావతి సీఐగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన శివప్రసాద్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏవీ బ్రహ్మం మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలతో మమేకమై, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తానన్నారు.

17లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ముప్పాళ్ళ: మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కజొన్న పండించిన రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు గాను ఈ నెల17వ తేదీలోపు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువు పొడిగించటమైందని మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ సోమవారం చెప్పారు. ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లోని వీఏఏ, వీహెచ్ఏ, ఎమ్‌పీఈఓల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తప్పనిసరిగా ఈక్రాప్‌లో పేరు నమోదై ఉండాల్సి ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

అచ్చంపేట: స్థానిక పాత ఎస్సీ కాలనీలో స్టెల్లా యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న కంభంపాటి నల్లయ్య స్మారక క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, బహుమతులను పంపిణీ చేశారు. మొదటి బహుమతి రాజేష్ సీసీ, ద్వితీయ బహుమతిని సాగర్ సీసీ జట్లు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్ రవికుమార్, ఇరిగేషన్ ఏఈ చిలకా భాస్కర్‌బాబు, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు గనుపల్లి సునీల్‌బాబు, స్టెల్లా యూత్ నిర్వహకులు సందెపోగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

క్రోసూరు: వేసవి సెలవుల్లో ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి పుస్తకపఠనం అలవర్చుకోవాలని, పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని మండల గ్రంథాలయాధికారి వై.వీరాంజమ్మ సోమవారం తెలిపారు. వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో పలువిషయాలపై ఆమె మాట్లాడారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. శిక్షణ తరగతుల్లో నిర్వహించిన పరీక్షల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతి వారం బహుమతులు అందజేయటం జరుగుతుందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

యడ్లపాడు: తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రికి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన యడ్లపాడులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యడ్లపాడు ఎస్టీ కాలనీకి చెందిన మొగిలి నాగయ్య, రమాదేవిలకు ముగ్గురు సంతానం. వీరిలో ఒక్కగానొక్క కుమారుడైన మొగిలి ప్రసాద్ తోటి వారితో చేరి వ్యసనాలకు అలవాటు పడుతున్నాడని తెలిసి తల్లి రమాదేవి ఈనెల ఏడోతేదీన మందలించింది. దీంతో మనస్తాపం చెందిన మొగిలి ప్రసాద్ కాలనీ పక్కనే ఉన్న పీబీసీ సాగర్ కాలువ ఒడ్డున కూర్చొని మద్యంలో గడ్డిమందు కలుపుకుని తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అదేరోజున గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ప్రసాద్(18) మృతి చెందాడు. తండ్రి నాగయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. దీంతో ఎస్టీకాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గ్రామాల్లో 'ఫ్యామిలీ ఫిజీషియన్'



కంటెపూడిలలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కవిత



కందులవారిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో డాక్టర్ సాయి తేజారెడ్డి

సత్తెనపల్లి: మండలంలోని కంటెపూడిలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్‌లో 196 మందికి వైద్య సేవలు అందించినట్లు ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు.ఎస్.ఎల్ కవిత చెప్పారు. గ్రామంలో జనరల్ గోపి 56 మందికి, హైపర్ టెన్షన్ 70 మందికి, గర్భిణులు తొమ్మిది మందికి, బాలింతలు నలుగురికి వైద్య సేవలు అందించామన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ జె.సంపూర్ణాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.నాని, ఎంపిహెచ్ఎ (ఎమ్) పి.నాగేశ్వరరావు, ఏఎన్ఎం జి.చిన్నకోటమ్మ, పి.శౌరితేజవి, ఆశ కార్యకర్తలు ఎం.మణిమ్మ, గీత, తదితరులు ఉన్నారు.

కందులవారిపాలెంలో...

మండలంలోని కందులవారిపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సాయి తేజ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 152 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో హైపర్ టెన్షన్ 52 మంది, డయాబెటిస్ 51 మంది, గర్భిణులు ఏడుగురు, బాలింతలు ఒకరు, చిన్నారులు ముగ్గురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ (ఎమ్) పెండెం మణిరావు, సిహెచ్ఓ వై.సారిక, ఎంపీహెచ్ఏ(ఎఫ్) పి. కృపావేణి, ఎంపీహెచ్ఏ(ఎమ్) బి.కిరణ్ కుమార్, ఆశా కార్యకర్తలు చెల్లిమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు పేర్ల నమోదు



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

నకరికల్లు: రైతుభరోసా కేంద్రాల్లో ఈనెల 18వ తేదీ వరకు డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా పథకానికి రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని చాగల్లు గ్రామంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది రైతుభరోసా పథకం లబ్ధిదారులు ఎవరైనా మృతిచెందితే వారి నామినీలకు పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పథకం పొందేందుకు భూమిపత్రాలు, ఆధార్‌కార్డు, ఇతర వివరాలతో కూడిన పత్రాలు విఏఏలకు అందజేయాలన్నారు. సీసీఆర్‌సి కార్డు పొందడం ద్వారా కౌలురైతులకు ప్రభుత్వ సహాయం అందుతుందని అన్నారు. జీవనఎరువులు, శిలీంద్రనాశనులు వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పి.బ్రహ్మనందం, విఆర్వో పి.చినబ్రహ్మయ్య, గ్రామ ఉద్యానవన సహాయకుడు కె.వెంకటకృష్ణ, సర్పంచ్ అలపర్తి కృష్ణకుమారి శ్రీనివాసరావు, మండల ఏఏబి చైర్మన్ కాండ్రు బిక్షమయ్య, గ్రామ ఏఏబి చైర్మన్ అలపర్తి రంగారావు, పిఏసిఎస్ డైరెక్టర్ అలపర్తి భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం

ఏఓ షేక్ సుగుణాబేగం

అచ్చంపేట: రైతులంతా ఖరీఫ్ సాగుకు సమాయత్తం అయ్యే సమయం ఆసన్నమైందని, పంటలు వేసేందుకు భూములను సిద్ధంగా ఉంచుకోవాలని ఏఓ షేక్ సుగుణాబేగం తెలిపారు. సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా మండలంలో గ్రంథశిరి, వేల్పూరు గ్రామాలలో సోమవారం ఆమె రైతు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షల ఆధారంగా ఎరువులు వాడవలసి ఉంటుందన్నారు. విత్తన ఎంపికలో మెలకువలు పాటించాలన్నారు. సాధ్యమైనంత వరకు పంట మార్పిడి విధానాన్ని పాటించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఆర్బీకేలలో లభించే పచ్చిరొట్టె విత్తనాలను సబ్సిడీపై పొంది రైతులు తమ భూములలో వేసుకోవాలన్నారు. ఎత్తు పెరగగానే రోటావేటర్ సహాయంతో భూమిలో కలయదున్నుకోవాలని చెప్పారు. రైతులు సేంద్రీయ ఎరువులు వాడుకోవాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. పశు వైద్యాధికారి స్వాతీదేవి మాట్లాడుతూ పశువులలో తరచు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాక్సినేషన్, డీ వార్మింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీకే, పశుసంవర్ధక, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదం



పోటీలకు హాజరైన జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

అచ్చంపేట: మానసిక ప్రశాంతతకు క్రీడలు దోహదపడతాయని, పండుగలు, శుభకార్యాల సమయంలో గ్రామీణ ప్రాంతాల మహిళలకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమని జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి పలు రకాల పోటీలు నిర్వహించారు. కోలాటం, మ్యూజికల్ చైర్స్, మోగులాగుట, లెమన్ స్పూన్, స్కిప్పింగ్, రన్నింగ్, వాకింగ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎప్పుడూ ఇంటిపనులు, వంట పనులు, పొలం పనులతో ఉండే మహిళలకు అప్పుడప్పుడు జరిగే పోటీలు నూతనోత్సాహాన్ని ఇస్తాయని చెప్పారు. క్రీడా పోటీలలో గ్రామస్తులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ చింతగుంట్ల అనూరాధ, హనుమంతరెడ్డి దంపతులు, ఎంపీటీసీ సుంకర సీతమ్మ, గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షుడు తుమ్మా శౌరెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: మండలంలోని నందిరాజుపాలెం గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సోమవారం ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధుల నుంచి రూ.25లక్షలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాలలో ప్రజల అవసరాలకు అణుగుణంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ మారెళ్ల సరోజినీసాంబశివారెడ్డి, వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మాదిగ రాజకీయ పోరాట సమితి పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు



సత్తెనపల్లి: మాదిగ రాజకీయ పోరాట సమితి పల్నాడు జిల్లా అధ్యక్షునిగా సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామానికి చెందిన దుగ్గి రాంబాబును నియమించారు. ఈ మేరకు మాదిగ రాజకీయ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నమాదిగ నుంచి రాంబాబు నియామక పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా రాంబాబు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తన పై ఎంత నమ్మకంతో తనకు పదవి కేటాయించిన జాతీయ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నమాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుని పోతూ పని చేస్తానన్నారు. రాంబాబు నియామకంపై పలువురు హర్షం వెలిబుచ్చారు.